క్లుప్తంగా

శ్రీరామ నవమి వేడుకలకు అంకురార్పణ



పందిరిరాట వద్ద పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కమిటీ సభ్యులు

ఏలేశ్వరం: శ్రీరామనవమి వేడుకలకు నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం అంకురార్పణ చేశారు. ఈనెల 17 తేదీన శ్రీరామనవమి పురస్కరించుకుని రామాలయాల వద్ద పందిరిరాట వేశారు. ప్రతి ఏడాది కొత్త సంవత్సరం రోజున నవమి వేడుకలకు అంకురార్పణ చేయడం అనావాయితీగా వస్తోంది. స్థానిక దిబ్బలపాలెంలోని కోదండ రామాలయం వద్ద పందిరి రాటా వేశారు. పెద్దవీధి, పల్లపువీధి తదితర రామాలయాల వద్ద పందిరి రాట వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, శిడగం వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తపోవనంలో వసంత నవరాత్ర మహోత్సవాలు

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో శ్రీరామ నవమి వరకూ వసంత నవరాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి మంగళవారం తెలిపారు. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నుంచి ఈనెల 17 వరకూ రామాయణ, వేద, దేవీభాగవత పారాయణాలు, మహాగణపతి పవనం, 14న శృంగేరి జగద్గురు జన్మ వర్ధంతి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రామతారక మహాహోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నట్టు మహాస్వామి తెలిపారు.

వాహనాల తనిఖీ

కిర్లంపూడి: ఎన్నికల నేపథ్యంతో జగపతినగరం పాత పోలీస్ స్టేషన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లీడర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. రూ.50 వేలు మించి నగదు తీసుకువెళితే తగిన ఆధారాలు చూపించాలన్నారు. అక్రమ మద్యం, ఇతర సామగ్రి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇద్దరు పీసీలు ఉన్నారు.

వలంటీర్ల రాజీనామా

తొండంగి: వలంటీర్ల సేవలపై టీడీపీ ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో గ్రామ వలంటీర్లు సామూహిక రాజీనామాలు చేస్తున్నారు. పి.అగ్రహారంలో తొమ్మిది మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఇప్పటికే పెరుమాళ్లపురం, యర్రయ్యపేట, ఎ.కొత్తపల్లి, బెండపూడి, శృంగవృక్షం, దానవాయిపేట తదితర గ్రామాలకు చెందిన గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తుంటే టీడీపీ నేతలు రాజకీయ కుట్రలు చేస్తున్నారని వలంటీర్లు అన్నారు. తమను గుర్తించిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు సమష్టిగా కృషి చేస్తామన్నారు.

వెంకటప్రసాద్‌కు ఉత్తమ అర్చక అవార్డు



ప్రధాన అర్చకుడు వెంకటప్రసాద్‌కు అవార్డు అందజేస్తున్న కలెక్టర్ నివాస్

ఏలేశ్వరం: లింగంపర్తి గ్రామానికి చెందిన శ్రీరాజ గోపాలస్వామివారి ఆలయ ప్రధాన అర్చకుడు వింజరపు వెంకటప్రసాద్ మంగళవారం జిల్లా ఉత్తమ అర్చక అవార్డు లభించింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కాకినాడలోని సూర్య కళామందిర్‌లో జిల్లా కలెక్టర్ జె.నివాస్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణ స్వామి చేతుల మీదుగా వెంకటప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారు వెంకటప్రసాద్‌ను నగదు, ప్రశంసా ప్రతంతో సన్మానించారు. వెంకటప్రసాద్‌ను ఆలయ ధర్మకర్త అవసరాల కిషోర్, వేదగాయత్రి బ్రహ్మణసంఘం సభ్యులు అభినందించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

తొండంగి: విద్యుత్ లైన్ల కన్‌స్ట్రక్షన్ పనుల కారణంగా ఎ.వి.నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ జగ్గంపేట ఈఈ రత్నాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఎ.వి.నగరం, ఆర్‌డబ్ల్యూయస్ ఫీడర్స్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

దుస్తుల పంపిణీ

శంఖవరం: కొంతంగి గ్రామంలో వృద్ధులకు, వికలాంగులకు అన్నవరం లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ పర్వత జానకీదేవి దుస్తులు పంపిణీ చేశారు. సుమారు 150 మందికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దూడల రామస్వామి, మాజీ సర్పంచ్ సర్నం గోవింద్, పర్వత వివేక్ గింజాల కొండబాబు, దూడల శివ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరం దేవస్థానం డీసీ రమేష్‌బాబు దంపతులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు



ధర్మవరంలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



ఏలేశ్వరంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు



శర్మకు ఉగాది అవార్డు అందిస్తున్న అన్నవరం దేవస్థానం ఈఓ

ఘనంగా ఉగాది వేడుకలు

- ప్రతి ఇంటా షడ్రుచులతో పచ్చడి తయారీ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- గ్రామగ్రామాల పంచాంగ పఠనం

ఏలేశ్వరం: శ్రీక్రోధి నామ సంవత్సర వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని అందరికీ పంపిణీ చేశారు.

ఏలేశ్వరంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే తమ ఇళ్ల వద్ద మహిళలు షడ్రుచులతో ఉగాది పచ్చడి చేయగా కుటుంబ సభ్యులు స్వీకరించారు. గ్రామగ్రామాన పండితుల సమక్షంలో పంచాంగ పఠనం చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని వినాయకుని గుడి వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు కటకం కిరిటి, ఏడీవీ ప్రసాద్, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు, మహిళలు పాల్గొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో పురోహితుడు గాథావఝుల సూర్యనారాయణ పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, అరవాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక శివాలయం, సత్యనారాయణస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్తిపాడు మండలంలో.. వాడవాడలా ఉగాది వేడుకలు

ప్రత్తిపాడు: మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి వారి పంచాయతన ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారి వద్ద ఉన్న శ్రీపాదాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అర్చనల అనంతరం భక్తులకు పంచామృతంతో పాటు ఉగాది పచ్చడిని అందజేశారు.

ప్రత్తిపాడు రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో ఉగాది వేడుకలు జరుపుకొన్నారు. ఆలయాల్లో వేద పండితులు పంచాగ పఠనం చేశారు.

ధర్మవరంలో ముగ్గుల పోటీలు

ధర్మవరం ఆదర్శ పాఠశాల్లో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో జువ్వల దేవి, బొల్లు వెంకటలక్ష్మి, బొల్లు హేమ వరలక్ష్మి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. జూనియర్స్ విభాగంలో మెగిలి దత్త సాయి సురేఖ, కరణం జానకీ, ఎడగాల ఉమా దేవి ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలను కై వసం చేసుకున్నారు. గ్రామ పెద్దల దొడ్డిపట్ల సోమన్నదొర, దాడి చిన్నారావు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా వి.రమాదేవి, ఎంవీ అన్నపూర్ణదేవి వ్యవహరించారు.



లోవ దేవస్థానంలో పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న రామచంద్రమోహన్, విశ్వనాథరాజు



జగ్గంపేటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన పంచాగ శ్రవణం

గోకవరం మండలంలో..

గోకవరం: మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఆలయల్లో ప్రత్యేక పూజలు చేశారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడి తిన్నారు. గోకవరంలోని దేవీచౌక్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉగాది సందర్భంగా ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ పంచాంగ పఠనం చేశారు. స్థానిక దాసరి వారి వీధిలోని రామాలయంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు ద్విభాష్యం సూర్య వెంకటసుబ్బారావుశర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దాసరి చిన బాబు, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో మంత్రి రాజా పూజలు

తుని: స్థానిక కొత్తపేటలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. క్రోధి నామ సంవత్సరంలో నియోజకవర్గంలో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని ఆకాంక్షించారు.

తుని రూరల్ మండలంలో..

తుని రూరల్: క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని గ్రామీణులు వేడుకగా నిర్వహించుకున్నారు. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో ఉగాది వేడుకులు, పంచాంగ పఠనం నిర్వహించారు. ఎస్.అన్నవరం, డి.పోలవరం, తేటగుంట, కేఓ.మల్లవరం, దొండవాక, రాపాక, టి.తిమ్మాపురం, హంసవరం, వల్లూరు, ఎస్.చామవరం, వి.కొత్తూరు, కుమ్మరిలోవ, కొలిమేరు, ఎస్.సూరవరం, రేఖవానిపాలెం తదితర గ్రామాల రామాలయాల్లో ఉగాది వేడుకులు నిర్వహించారు. లోవ దేవస్థానంలో తంగిరాల పూర్ణయ్య సిద్ధాంతి రచించిన క్రోధి నామ సంవత్సరం గంటల పంచాంగాన్ని (2024–25) అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ఆవిష్కరించారు. ఇన్‌చార్జి డీసీ, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, వేదపండితులు, అర్చకులు, వేద విద్యార్థులు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని దానవాయిపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ మడదా ప్రభాకర్ ఆధ్వర్యంలో భక్తులకు ఉగాది పచ్చడి వితరణ చేశారు.



గోకవరంలో పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితులు సుబ్బారావుశర్మ

అనంతరం వేదపండితులు పంచాంగం పఠనం చేశారు. మండలంలోని అద్దరిపేట, పంపాదిపేట, పైడికొండ, శృంగవృక్షం, తొండంగి, ఎ.కొత్తపల్లి, పి.ఇ.చిన్నాయపాలెం, బెండపూడి తదితర గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు పూజలు జరిగాయి.

జగ్గంపేట: గ్రామంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆ సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ప్రారంభించారు. సభ్యులందరూ సంప్రదాయ దుస్తుల్లో కార్యక్రమంలో పాల్గొని అలరించారు. కె.నర్సింహమూర్తి పంచాంగ పఠనం చేశారు. అనంతరం ఉగాది పచ్చడిని అందరికి పంపిణీ చేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు కొత్త భైరవకృష్ణ, బొండా నూకబాబు, మానేపల్లి బంగార్రాజు, కొత్త మాధురి తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల జాతరలు ప్రారంభం

గోకవరం: మండల గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవతల జాతర్లు ఘనంగా ప్రారంభమయ్యాయి. గోకవరంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న గుబ్బాలమ్మను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లిలో నూకాలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

తలుపులమ్మతల్లి ఆదాయ, వ్యయాలు సరిసమానం

తుని రూరల్: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారి క్రోధి నామ సంవత్సరంలో ఆదాయ వ్యయాలు సరి సమానంగా ఉన్నాయని వేదపండితులు పురుషోత్తమ శర్మ తెలిపారు. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకుని లోవదేవస్థానంలో ఇన్‌చార్జి డీసీ, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో వేదపండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. వేదపండితులు పురుషోత్తమశర్మ పంచాంగ శ్రవణం చేశారు. తలుపులమ్మ అమ్మవారి రాశి తులారాశి, స్వాతినక్షత్రం కావడంతో ఈ సంవత్సరం ఆదాయం 8, వ్యయం 8, రాజపూజ్యం 7గా ఉందన్నారు. అనంతరం వేదాశీస్సులు అందజేశారు. అన్నవరం దేవస్థానం డీసీ రమేష్‌బాబు, తుని రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి దంపతులు, రూరల్ ఎస్సై రమేష్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

ముగ్గురికి ఉగాది పురస్కారాలు

లోవ దేవస్థానంలో సేవలు అందిస్తున్న ముగ్గురికి అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.రామచంద్రమోహన్ ఉగాది పురస్కారాలు అందజేశారు. లోవ దేవస్థానంలో ఇన్‌చార్జి డీసీ, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేదపండితులు అరిపిరాల పురుషోత్తమ శర్మ, ఉప ప్రధాన అర్చకులు దూలం వీరరాఘవులు, అర్చకులు ధూళిపాళ సాయి శ్రీనివాస శర్మలకు ఉగాది పురస్కారాలు దక్కాయి. వీరికి దేవస్థానంలో పని చేసే వేదపండితులు, ప్రధాన అర్చకులు, అర్చకులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.



లోవదేవస్థానంలో పంచాగ పఠనం చేస్తున్న వేదపండితులు, పాల్గొన్న అధికారులు, భక్తులు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

తుని: వైఎస్సార్ సీపీలో చేరికలు భారీగా కొనసాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం పట్టణంలో వీరవపరపుపేట ఎండీ పేటకు చెందిన టీడీపీ ఎస్సీసెల్ టౌన్ సెక్రటరీ కాకాడ శివ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు మురమళ్ల ప్రశాంతకుమార్, బర్రె ప్రసన్నబాబు, ఉండ్రాసపు ప్రేమ్‌కుమార్, మురమళ్ల అశోక్, మసిలపల్లి నాగేంద్రకుమార్, మసిలపల్లి రాకేష్, కాకడ రవి, కాకాడ లక్ష్మి, అరుగుల దుర్గ, పెనుబోతుల తరుణ్‌కుమార్‌ల తోపాటు మరో 200 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, శనాల శాఖమంత్రి దాడిశెట్టి రాజా వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మరోసారి ఆశీర్వదించండి

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్
- ఇండుగపల్లిలో ఎన్నికల ప్రచారం

కోటనందూరు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని రోడ్లు, భవనాల శాఖమంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఇండుగపల్లిలో సర్పంచ్ కుంచే సత్యవతి ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, తుని నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న తన తండ్రి దాడిశెట్టి రాజాను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు ఎన్నికల ప్రచారానికి వచ్చిన శంకర్‌మల్లిక్‌కు బాణసంచా కాల్పులు, డప్పువాయిద్యాలతో వైఎస్సార్ సీపీ నాయకులు స్వాగతం పలకగా మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సర్పంచ్ సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే అచ్చిరాజు, గుడివాడ ఆదినారాయణ, బొత్స సత్తిబాబు, సుర్ల రాజు, ఉల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఇండుగపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శంకర్‌మల్లిక్

అరుణాచల క్షేత్రంలో సురభి కామధేను మహాయజ్ఞం

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి శ్రీరమణ సేవా ఆశ్రమంలోని అరుణాచలక్షేత్రంలో సురభికామధేను మహా మజ్ఞాన్ని నిర్వహించారు. లక్షా ఎనిమిది వేల గోవు పిడకలు, 250 కేజీల ఆవు నెయ్యి, ఒక టన్ను సమ్మెదెలు, 21 ఔషధాలతో తయారు చేసిన 250 కేజీల హోమపుపొడి వంటి సుగంధ ద్రవ్యాలతో సురభి కామధేను మహాయజ్ఞానాన్ని న్యూఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ జీవీఆర్ శాస్త్రీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామివారికి ఏకాదశి రుద్రాభిషేకం, ధాన్యభిషేకం, చండీ హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఏర్పాట్లను స్వామి రామానంద పర్యవేక్షించారు.



రాచపల్లి అరుణాచల క్షేత్రంతో యజ్ఞాన్ని నిర్వహిస్తున్న పండితులు

జనసేన జగ్గంపేట ఇన్‌చార్జిగా తుమ్మలపల్లి రమేష్

గోకవరం: జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జిగా తుమ్మలపల్లి రమేష్‌ని ఆ పార్టీ నియమించింది. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు అందాయి. గత ఐదేళ్లగా పార్టీ ఇన్‌చార్జిగా పని చేస్తున్న పాటంశెట్టి సూర్యచంద్ర స్థానంలో ఆయనను నియమించారు. పొత్తులో భాగంగా టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ చెందిన జ్యోతుల నెహ్రూని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. పార్టీకి ఐదేళ్లు కష్టపడి పని చేసిన తనకు కాదని టీడీపీకి ఎమ్మెల్యే సీటు కేటాయించడంపై మనస్థాపానికి గురై తనలాంటి సామాన్యులు, రబ్బరు చెప్పులు వేసుకునే వారికి అసెంబ్లీకి వెళ్లడానికి పని చేయరా అంటూ సతీమణితో కలిసి సూర్యచంద్ర ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం దీక్ష విరమించి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీలో ఉంటానని ప్రకటించారు. ఇప్పటికే నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కిర్లంపూడి మండలం రామచంద్రపురానికి చెందిన తుమ్మలపల్లి రమేష్ పిఠాపురంలో పవన్ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరారు.

చలివేంద్రం ప్రారంభం

తుని: బాట సారులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు లోవ సూర్యా ఫౌండేషన్, విజయ దుర్గ వ్యాపార సంస్థల ఎండీ చోడిశెట్టి త్రిమూర్తి స్వామి తెలిపారు. మంగళవారం స్థానిక జీఎస్టీ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో మూడు నెలల పాటు మజ్జిగ చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు.

రత్నగిరిపై ఉగాది శోభ



రథోత్సవంలో కోలాటం ప్రదర్శిస్తున్న పిల్లలు

- ప్రత్యేక అలంకరణతో అలరించిన ఆలయ ప్రాంగణం
- రథం లాగేందుకు పోటీ పడిన భక్తజనం
- రాత్రి వెండి గజవాహనంపై సత్యదేవుడు, అమ్మవార్ల ఊరేగింపు

అన్నవరం: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు రత్నగిరిపై ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రత్నగిరి సత్యదేవుని ఆలయం, ఆలయ ప్రాంగణం, అనివేటి మండపాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. అనివేటి మంటపం వెలుపల పుష్పాలంకరణ మధ్య ఏర్పాటు చేసిన సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల ఉత్సవమూర్తులు, తూర్పు రాజగోపురం వద్ద చేసిన పుష్పాలంకరణ అందరినీ ఆకర్షించింది. ఉదయం 11–30 గంటలకు రత్నగిరి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సత్యదేవుని రథోత్సవంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. పిల్లలు రథోత్సవం ముందు ప్రదర్శించిన సంప్రదాయక నృత్యాలు అందరినీ అలరించాయి. రథంలో సత్యదేవుడు, అమ్మవారి అలంకరణ అందరినీ అలరించింది.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు

ఉగాది పర్వదినం సందర్భంగా సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. సత్యదేవుని దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది.

గజవాహనంపై సత్యదేవుని ఊరేగింపు

రాత్రి సత్యదేవుడు, అమ్మవారిని వెండి గజవాహనంపై అన్నవరం గ్రామంలో ఘనంగా ఊరేగించారు. రాత్రి 7–30 గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని ఆలయం నుంచి మెట్ల మార్గాన పల్లకీ మీద ఊరేగింపుగా కొండదిగువకు తీసుకువచ్చారు. అక్కడ వెండి గజవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను గ్రామంలో ఘనంగా ఊరేగించి తిరిగి ఆలయానికి చేర్చారు.



సత్యదేవుని రాజగోపురం వద్ద పుష్పాలంకరణ



వెండిరథంపై ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు